క్లుప్తంగా

ఐక్యతతోనే హక్కుల సాధన

సదుం: వ్యవసాయ కూలీలు, ఇతర వృత్తుల ఐక్యతోనే హక్కులను సాధించుకోగలమని ఏపీవీవీయూ మండల కార్యదర్శి చంద్రమ్మ తెలిపారు. బుధవారం ప్రపంచ వ్యవసాయ కూలీల పోరాట దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె విలేకర్లతో మాట్లాడారు. చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు.

150 మందికి రంజాన్ తోఫా



సరుకులు పంపిణీ చేస్తున్న అలీమ్‌బాషా, నాగభూషణం

పుంగనూరు: పట్టణంలోని ఫలాహ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ అధినేత హఫీజ్‌ఖాన్ బుధవారం 150 మంది పేదలకు ఒక్కొక్కరికి రూ.1,500 విలువైన సరుకులను రంజాన్ తోఫా కింద అందించారు. జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, అహమ్మద్‌ఖాన్, ఉస్మాన్ పాల్గొన్నారు.

4న మున్సిపల్ దుకాణాల వేలం

పుంగనూరు: మున్సిపల్ పరిధిలోని ప్రైవేట్ బస్టాండ్, జనరల్ షాపు రూము, దినసరి మార్కెట్, వారపుసంత, ఖాళీగా ఉన్న గదులను ఏప్రిల్ 4న ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు మున్సిపల్ నిబంధనల మేరకు డిపాజిట్ చెల్లించి, వేలంపాటలో పాల్గొనవచ్చని సూచించారు.

పంట పొలాల పరిశీలన



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ హరిప్రసాద్

సదుం: మండలంలో ఇటీవల ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంట పొలాలను ఏఓ హరిప్రసాద్ బుధవారం పరిశీలించారు. పంట నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపి, రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్‌ఏ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

యువకునికి కరోనా లక్షణాలు

రామకుప్పం: మండలకేంద్రం రామకుప్పంకు చెందిన ఓ యువకుడికి కరోనా లక్షణాలు ఉన్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి లోకేష్ తెలిపారు. శ్వాసకోస ఇబ్బందితో ఆస్పత్రికి వచ్చిన యువకుడికి కరోనా పరీక్షలు చేశామన్నారు. కరోనా లక్షణాలు ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు. కోవిడ్ బారిన పడకుండా ప్రజలు మాస్కులు ధరించాలని ఆయన సూచించారు.

ఇంటర్ పరీక్షకు 25 మంది గైర్హాజరు

పుంగనూరు: పట్టణంలోని మూడు కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన ఇంటర్ సెకండియర్ పరీక్షకు 25 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పర్యవేక్షణాధికారులు రెడ్డెప్ప, కమలాకర్, విజయకుమారి తెలిపారు. మొత్తం 705 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు వెల్లడించారు.

చింతకుప్పంలో డ్యాన్స్ పోటీలు రేపు

రామకుప్పం: శ్రీరామనవమి పండగ సందర్భంగా మండలంలోని చింతకుప్పం గ్రామంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.10,116, ద్వితీయ బహుమతి రూ.6,116, తృతీయ బహుమతి రూ.3,516, నాలుగో బహుమతి రూ.2,516, ఐదో బహుమతి రూ.1,516 ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గలవారు 93466 34386 నంబరులో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి కాశీవిశ్వేశ్వరుని బ్రహ్మోత్సవాలు

రామకుప్పం: మండలకేంద్రం రామకుప్పంలో వెలసిన శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో గురువారం నుంచి 11 రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కోదండరెడ్డి, సంస్థాన కర్త సీతాపతి తెలిపారు. గురువారం కలశస్థాపన, ధ్వజారోహణం, శుక్రవారం భూత వాహనోత్సవం, శనివారం సింహ వాహనోత్సవం, ఆదివారం నెమలి వాహనోత్సవం, సోమవారం హంస వాహనోత్సం, మంగళవారం గిరిజా కళ్యాణం, బుధవారం రథోత్సవం, గురువారం పార్వేట ఉత్సవం, శుక్రవారం వసంతోత్సవం, శనివారం ద్వాదశి హారతులు, సోమవారం శ్రీవారి పుష్పపల్లకి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తున్నాం
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే వెంకటేగౌడ



సమావేశానికి హాజరైన డ్వాక్రా మహిళలు



మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: మహిళల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఆసరా మూడో విడత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం ఆయన పెద్దపంజాణి మండలానికి సంబంధించి మూడోవిడత 1111 గ్రూపుల్లో ఉన్న 10641 సభ్యులకు సంబంధించిన రూ.11.17 కోట్ల రుణమాఫీ మెగా చెక్కును అందజేశారు. అలాగే 292 ఎస్సీ గ్రూపులకు సంబంధించి రూ.1.98 కోట్ల రుణాలు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. అందుకు సంబంధించి చెక్కును ఎమ్మెల్యే ఆ గ్రూపు మహిళలకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు చంద్రబాబు నాయుడు రుణమాఫీ చేస్తానంటూ మహిళలను మోసం చేశారని, అయితే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి అక్కచెల్లెమ్మలను లక్ష్యాధికారులను చేసే దిశగా డ్వాక్రా రుణాలను మాఫీ చేసి ఆదుకుంటున్నారని తెలిపారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేసి కోట్ల మంది అక్క చెల్లెమ్మలను ఓ అన్నగా ఆదుకున్నారని కొనియాడారు. రాష్ట్రప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అమ్మఒడి, వసతి దీవెన, విద్యాదీవెన, కాపు నేస్తం, చేయూత, సున్నా వడ్డీ, ఆసరా వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. సచివాలయ వ్యవస్థతో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. రానున్న ఎన్నికల్లో పలమనేరు ఎమ్మెల్యేగా తనను, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సుష్మకీర్తి, పెద్దపంజాణి మండల కన్వీనర్ భాగారెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, అంజమ్మ, సింగిల్‌విండో చైర్మన్ ఓబుల్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు హరినాథ్, ఏఎంసీ డైరెక్టర్లు ఎర్రబల్లి శ్రీనివాసులు, సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, మాకయ్య, ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్, ఏపీఎం కృష్ణప్ప, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా మండల అభిషేక పూజలు



ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు

పెద్దపంజాణి: మండలంలోని సుద్దగుండ్లపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జయప్ప ఇటీవల నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో మండల అభిషేక పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి డా.చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు, గట్టప్ప పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు తదితరులు



విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

చౌడేపల్లె: విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు తెలిపారు. బుధవారం చౌడేపల్లె ఉన్నతపాఠశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. దామోదరరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. పాఠశాలలోని క్రీడాకారులకు రూ.25వేల నగదు ప్రోత్సాహకం అందించారు. యువకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ బాబు సహకారంతో క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ రామమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాములు, సర్పంచ్ వరుణ్‌భరత్, పీఎంసీ చైర్మన్ అంజనీకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు మురళి, దేవదానం, పీడీ రామచంద్ర, ఈశ్వర్, రాజేంద్ర, సుధాకర్ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి



సమస్యలు తెలుసుకుంటున్న జెడ్పీటీసీ నితిన్ రెడ్డి, తహసీల్దార్ మురళి

రామకుప్పం: మండలంలోని రాజుపేట గ్రామంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి అధికారులను కోరారు. బుధవారం రాజుపేట గ్రామంలో తహసీల్దార్ మురళి, జెడ్పీటీసీ నితిన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను గ్రామస్తులు, జెడ్పీటీసీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం గ్రామంలో సమస్యాత్మకంగా ఉన్న రెవెన్యూ ప్రదేశాలను పరిశీలించారు. తహసీల్దార్ మురళి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు బాల మురుగన్, ఆంజనేయులు, అజయ్ రెడ్డి, నారాయణస్వామి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి

రొంపిచెర్ల: మండలంలోని మోటుమల్లెల పంచాయతీ బండమీద చల్లావారిపల్లెలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నేత రాచపల్లె రామచంద్రారెడ్డి భౌతికకాయానికి బుధవారం పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి నివాళులర్పించారు. మంత్రి పెద్దిరెడ్డికి ప్రధాన అనుచరుడైన రామచంద్రారెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుమారులు మహేశ్వర్ రెడ్డి, సురేంద్రరెడ్డి, కృష్ణారెడ్డికి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పెద్దిరెడ్డి దేవేంద్రరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, సదాశివరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీరామనవమి వేడుకలు

పలమనేరు: పట్టణంలోని కొత్తపేట జవిళివీధిలో వెలసిన శ్రీకోదండరామస్వామి భజనమందిరంలో నేటి నుంచి శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. 1854లో పత్తికొండకు చెందిన ముద్దప్ప ఈ ఆలయాన్ని స్థాపించారు. అప్పట్లో రాతిమిద్దెగా ఉన్న ఆలయం కాలక్రమేణా రాములవారి భజనమందిరంగా రూపాంతరం చెందింది. యల్లంపల్లి రాజన్న శెట్టి ఆధ్వర్యంలో ఏటా శ్రీరామనవమికి ప్రత్యేక పూజలు, హరికథలు కొన్నేళ్లుగా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆయన వారసులు నిత్యపూజా కార్యక్రమాలను ఆలయంలో చేపడుతున్నారు.

వి.కోటలో..

వి.కోట: పట్టణంలో వెలసిన శ్రీరాముడి ఆలయం వద్ద శ్రీరామనవమిని పురస్కరించుకుని నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో స్వామివారి ప్రతిరూపాలను విద్యుత్ దీప కాంతులతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేయించారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం



బహుమతులు పొందిన విద్యార్థులు

వి.కోట: కాలం చాలా విలువైనదని దాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఎండీహెచ్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పవన్ కళ్యాణ్ సూచించారు. బుధవారం మండలంలోని కత్రిపల్లి ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పవన్‌కల్యాణ్ వారి సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 250 మంది విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే 15 మంది పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహిస్తూ బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అంతేగాక ఈ ఏడాది పదో తరగతిలో మొదటి, రెండవ, మూడోస్థానాల్లో మార్కులు సాధించిన విద్యార్థులకు తమ సంస్థ ద్వారా నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సురేంద్ర రావు, చైర్మన్ వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నడివీధి గంగమ్మ జాతర చాటింపు

చౌడేపల్లె: మండలకేంద్రంలో నడివీధి గంగమ్మ జాతరను ఏప్రిల్ 11, 12వ తేదీల్లో నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఈ మేరకు పురవీధుల్లో జాతర చాటింపు వేయించారు.

చెరువులో ఆక్రమణల తొలగింపు



భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

చౌడేపల్లె: గడ్డంవారిపల్లె మార్గంలోని కోమటివాని చెరువులో ఆక్రమణలను బుధవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. కబ్జాలపై ఆయకట్టు రైతుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ మాధవరాజు విచారణ ఆదేశించారు. ఈ మేరకు ఆక్రమణలను తొలగించి, భూమి చుట్టూ ట్రెంచ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

వేలంలో రూ.6.41లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న ఈఓపీఆర్డీ గఫూర్ సాహెబ్

సోమల: మండలంలోని కందూరు పంచాయతీకి వేలం పాట ద్వారా రూ.6.41 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓపీఆర్డీ గఫూర్ సాహెబ్, కార్యదర్శి జైశంకర్ తెలిపారు.బుధవారం సంతగేటు, ప్రైవేటు బస్టాండు గేటుకు సర్పంచ్ మసూద్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. సంతగేటు రూ.5.65 లక్షలకు, బస్టాండు గేటు రూ.76.5వేలకు పాడుకున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు రామనారాయణ, రాజారెడ్డి, ఆదం, భాస్కర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రామకోటి కీర్తాలాపన



సదుం: మండలంలోని నడిగడ్డ వెంకటరెడ్డిగారిపల్లె రామాలయంలో రామకోటి కీర్తాలాపనను బుధవారం ప్రారంభించారు. 24గంటల పాటు కొనసాగే ఈ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే పచ్చార్లమాకులపల్లె, తాటిగుంటపాలెంలోని రామాలయాలను శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబు చేశారు.

దివ్యాంగులకు ట్రైస్కూటర్ల పంపిణీ



ట్రైస్కూటర్లు పంపిణీ చేస్తున్న నేతలు

సదుం: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం దివ్యాంగులు పుష్పావతి, సుధాకర్, మునిరాజాకు ఎంపీపీ ఎల్లప్ప, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి చేతులమీదుగా రూ.4.50లక్షల విలువైన ట్రైస్కూటర్లను పంపిణీ చేశారు. లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు అండగా నిలిచిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి కోదండ రామాలయంలో ఉత్సవాలు

పెద్దపంజాణి: మండలంలో ప్రసిద్ధి గాంచిన రాయలపేట శ్రీకోదండ రామాలయంలో మార్చి 30వ తేదీ నుంచి ఏప్రిల్ 9 వరకు శ్రీరామనవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు బుధవారం తెలిపారు. ప్రతిరోజు ఉదయం ఆలయంలోని సీతారామలక్ష్మణ విగ్రహాలకు అభిషేకాలు, రాత్రి సమయంలో ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించనున్నట్లు వివరించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు

- పార్టీలతో సంబంధం లేకుండా అభివృద్ధి పనులు చేపట్టండి
- మండలమీట్‌లో జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్

కుప్పం: వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అశ్విని అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ సమావేశంలో ఎమ్మెల్సీ భరత్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. 15 రోజులకు ఒకసారి స్థానికంగా ఉండే అధికారులు ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకున్న గృహాలకు సక్రమంగా బిల్లులు రావడం లేదని సభ్యుల నుంచి లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా వారు అధికారులపై మండిపడ్డారు. నూతనంగా మంజూరైన ఇళ్లు, నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, లేకపోతే బిల్లులు మంజూరు కావని సూచించారు. పార్టీలతో సంబంధం లేకుండా పారదర్శంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం శాఖల వారీగా అభివృద్ధి పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శరవణ, వన్నెలకు క్షత్రియ చైర్మన్ వనిత, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మోజీ గౌడ్, డైరెక్టర్లు పెద్దన్న, శ్రీనివాసమూర్తి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీకి రూ 2.40లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఎల్లంకివారిపల్లె పంచాయతీకి బుధవారం నిర్వహించిన వేలం ద్వారా రూ.2.40లక్షల ఆదాయం వచ్చినట్లు ఎంపీడీఓ సుగుణమ్మ తెలిపారు. వారపు సంతను రూ.2.25లక్షలకు రవీంద్రనాయుడు, బస్టాండును రూ.15,150 మునిరాజా దక్కించుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి బాబు, నాయకులు సైపుల్లా, ఆనంద, మునిరత్నం, రాజమూర్తి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఇంటింటా 'మా నమ్మకం నువ్వే జగనన్న'



స్టిక్కర్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మతుకువారిపల్లెలో ఎంపీటీసీ సభ్యులు ఉషారాణి, సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటా మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అంటించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు చంద్రశేఖరరెడ్డి, గోవింద రెడ్డి, సురేంద్ర రెడ్డి, హరినాథ్, రామచంద్రారెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ భారతి

రొంపిచెర్ల: పోషణ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం రొంపిచెర్ల–1 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి మాట్లాడుతూ కొర్రలు, అరికలు, జొన్న, సజ్జ, రాగి తదితర చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను భుజించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కాంతమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు అలివేలు, లావణ్య, హసీనా, సంపత్‌కుమారి, లక్ష్మీదేవి, రమణమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిధులు



మాట్లాడుతున్న చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహ్రసాద్

పుంగనూరు: ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన వార్డుబాటలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి రూ.74లక్షలు కేటాయించినట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. బుధవారం నిర్వహించిన పురపాలక సంఘం సమావేశంలో ఆయన కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని ఎంబీటీ రోడ్డు విస్తరణ, సుందరీకరణకు రూ.50కోట్లు విడుదల చేయించిన మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్ అమ్ము మాట్లాడుతూ పకడ్బందీగా పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు చేపట్టాలన్నారు. కౌన్సిలర్ త్యాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది దురుసు ప్రవర్తన కారణంగా ప్రజలు ఇబ్బందిపడుతున్నారని ఫిర్యాదు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ జనంతో దూకుడుగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నాగేంద్ర పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం



గర్భిణులు, బాలింతలకు అవగాహన

గంగవరం: మండలంలోని స్త్రీశక్తి భవనంలో గర్భిణులకు పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీఓ ఇందిరాప్రియదర్శిని, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, వైద్యాధికారి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే మెరుగైన ఆరోగ్యం పొందుతారని తెలిపారు. ఆరోగ్య జాగ్రత్తలు పాటించడంతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. చిరుధాన్యాల వల్ల కలిగే ఉపయోగాలపై స్టాల్స్ ఏర్పాటు చేసి చూపించారు. మాతృ మరణాలు, శిశు మరణాలు జరగకుండా తమవంతు కృషి చేయాలని అన్ని శాఖల అధికారులను కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్ప, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పవిత్ర, సాధారణ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ పాలకవర్గం ఆమోదం తెలిపింది. స్థానిక మున్సిపల్ సమావేశపు హాలులో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా అజెండాలోని దినసరి మార్కెట్, చేపలచెరువులు, చింతచెట్ల ఫలసాయం తదితర వాటికి సంబంధించి వేలంపాటలో హెచ్చు పాటదారులకు గుత్తల కేటాయింపును సభ్యులు ఆమోదించారు. మున్సిపాలిటీకి సంబంధించి 2023–24 బడ్జెట్‌లో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి పద్దులు, వాటిని ఖర్చు చేయుట, సాధారణ పరిపాలన నిధులు ఖర్చులు, ప్రజాఆరోగ్య విభాగం బడ్జెట్ ఖర్చులు తదితర 16 అంశాలకు కౌన్సిల్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇలా ఉండగా టీడీపీ కౌన్సిలర్ శారద మాట్లాడుతూ తన వార్డులో రోడ్లు ఇబ్బందిగా ఉన్నాయని రోడ్లను నిర్మించాలని కోరింది. ఇప్పటికే టెండర్లు వేశామని పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాలేదని దీనిపై చర్యలు తీసుకుంటామని ఏఈ లోకేష్ సమాధానం చెప్పారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపల్ సమావేశంలో సభ్యులు సూచించిన సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. వచ్చే వేసవిలో మంచినీటికి సమస్య లేకుండా ఇప్పటికే ముందస్తు చర్యలను తీసుకున్నట్లు పేర్కొన్నారు. గంటావూరు చేపల చెరువు వేలం పొందిన వ్యక్తి తనకు చెరువులో నష్టం వచ్చిందని కాబట్టి ఈదఫా ధర తగ్గించాలని కోరిన అంశాన్ని పునఃపరిశీలించాలని కౌన్సిలర్ నాగరాజు సూచించారు. దీంతో ఈ అంశం వాయిదా పడింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు చాన్నా, కిరణ్‌కుమార్, కోఆప్షన్‌సభ్యులు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.